# జిల్లాలో ఆర్యవైశ్యుల బలోపేతమే నా లక్ష్యం

- 3వేల సభ్యత్వాలు పూర్తి చేసి తీరుతా..
- నిరుపేద వైశ్యుల సంక్షేమానికి నిబద్ధతతో పనిచేస్తున్నా..
- పాల్వంచలో సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలి
- ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దారా రమేష్
- పాల్వంచ మండలంలో 500కి తగ్గకుండా సభ్యత్వాలు పూర్తి చేస్తాం..
- పాల్వంచ మండల అధ్యక్షులు చలువాది ప్రకాష్



పాల్వంచ, మే14(కెరటం న్యూస్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్యవైశ్యులను అన్ని రంగాల్లో బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, జిల్లాలో 3 వేల సభ్యత్వాలు పూర్తి చేసి తీరుతానని, ప్రభుత్వం నుంచి నిరుపేద వైశ్యుల సంక్షేమానికి నిబద్ధతతో పనిచేస్తున్నానని, పాల్వంచలో సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలని ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దారా రమేష్ కోరారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దారా రమేష్ మండల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం పాల్వంచలో సమావేశం జరిగినది. ఈ కార్యక్రమాన్ని పాల్వంచ మండల అధ్యక్షులు చలువాది ప్రకాష్ ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దారా రమేష్ మాట్లాడుతూ.. వారి మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం.. జిల్లా కార్యాలయ భవనానికి స్థల సేకరణ చేయటం జరిగిందన్నారు. అలాగే పాల్వంచ నందు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ శాశ్వత సభ్యత్వాలు పెంచాలని చెప్పడం జరిగింది. అలాగే జిల్లా అధ్యక్షులు వారు మేనిఫెస్టోలో చెప్పిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ శాశ్వత సభ్యత్వాలు 10 ఉచితంగా అందజేయడం జరిగింది. వీరికి గ్రూప్ ఇన్సూరెన్స్ కూడా ఇవ్వటం జరుగుతుందన్నారు. త్వరలో కొత్తగూడెంలో వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తానని చెప్పారు. హైదరాబాదులోని ఆర్యవైశ్య హాస్టల్ నందు అర్హులైన ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ఉచిత వసతి ఏర్పాటు చేపిస్తానని చెప్పారు.

అనంతరం పాల్వంచ మండల అధ్యక్షులు చలువాది ప్రకాష్ మాట్లాడుతూ.. పాల్వంచ మండలంలో వేలాది మంది ఆర్యవైశ్యులు ఉన్నప్పటికీ సభ్యత్వ నమోదులో కాస్త వెనుకబడ్డామని, ఒక నెల రోజుల వ్యవధికాలంలోనే పాల్వంచ మండలంలో సభ్యుల సహకారంతో 500కి తగ్గకుండా సభ్యత్వాలు పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పొలిటికల్ కమిటీ చైర్మన్ కోదుమూరి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కండె రమేష్, జిల్లా జాయింట్ సెక్రటరీ మైలవరపు బసవయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పసుమర్తి శ్రీనివాస్, తల్లాడ ఉపేందర్, పాల్వంచ మండల అధ్యక్షులు చలువాది ప్రకాష్, ఇల్లందు మహాసభ యువజన సంఘం అధ్యక్షులు నరేంద్రుల అనుబాబు, మండల ప్రధాన ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీనివాస్, మండల కోశాధికారి ఉప్పల వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు దారం శ్రీనివాస్, గూడెపు శ్రీనివాస్, మహిళా నాయకురాళ్ళు, దొంతు మౌనిక, గుబ్బా దుర్గ, వి.ఇందుమతి, రాజ్యలక్ష్మి, మహాసభ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థులకు కృత్రిమ మేధపై శిక్షణ

హైదరాబాద్, మే14(కెరటం న్యూస్)

ఇంజనీరింగ్ విద్యార్థులకు కృత్రిమ మేధపై నైపుణ్యం కల్పించడమే లక్ష్యంగా 'సమ్మర్ ఆఫ్ ఏఐ' శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వం.ఏఐ సెంటర్ హెడ్, కిరణ్ చంద్ర తెలిపారు. శత సహస్ర యాగం అనే ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నెల రోజుల పాటు జరగనుందన్నారు. ఇది ప్రపంచంలో మొట్టమొదటి తెలుగు లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) అభివృద్ధికి తోడ్పాటు అందించనుందన్నారు. దీని ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్న లక్ష మందికి పైగా ఇంజినీరింగ్ విద్యార్థులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఐఐఐటీ హైదరాబాద్, స్వేచ్ఛ, మెటా, హెచ్వైఎస్ఈఏ, ఓజోనెటెల్ తదితర సంస్థల సహకారంతో ఇది రూపుదిద్దుకుందన్నారు. విద్యార్థులు ఏఐ/ఎంఎల్ ప్రాథమికాంశాలు, డేటా ప్రిపరేషన్, మోడల్ బిల్డింగ్, డిప్లాయ్మెంట్ వంటి అంశాలలో నైపుణ్యం పొందుతారన్నారు. ఈ హైబ్రిడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) కోర్సు ద్వారా విద్యార్థులు తెలుగు ఎల్ఎల్ఎం అభివృద్ధిలో భాగస్వాములవుతారన్నారు. ఇందులో డేటా సేకరణ, డేటా క్యూరేషన్, ఇండిక్ (తెలుగు) డేటాసెట్ నిర్మాణం, ఆపై ఆ డేటా ఆధారంగా విద్యార్థులు ఏఐ మోడల్ అభివృద్ధిని సమగ్రంగా నేర్చుకుంటారని తెలిపారు.

ఈ కోర్సు సైద్ధాంతిక అభ్యాసాన్ని ఏఐ పరిష్కారాలతో అనుసంధానించేందుకు రూపొందించామన్నారు. ఇది ప్రాథమిక ఏఐ నైపుణ్యాలు, ఏఐ, మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) సూత్రాలు, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం), జనరేటివ్ ఏఐ అభివృద్ధి, ఎల్ఎల్ఎంల శిక్షణ కోసం అవసరమైన డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్ సాంకేతికతలను అందించడంపై దృష్టి సారిస్తుందని తెలిపారు. ఈ కోర్సులో డేటా సేకరణ, డేటా శుద్ధి, ఇండిక్ (తెలుగు) డేటాసెట్ల నిర్మాణం, ఆ డేటా ఆధారంగా ఏఐ మోడల్‌ను నిర్మించే పూర్తి ప్రయాణాన్ని అర్థం చేసుకుంటారన్నారు. ఈ ఇంటర్న్‌షిప్ 'తెలుగు ఎల్ఎల్ఎం' (లార్జ్ లాంగ్వేజ్ మోడల్) ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉంటుందన్నారు. ఇంటర్న్స్ డిజిటల్-ఫస్ట్ డేటా సేకరణలో భాగంగా పని చేస్తారన్నారు. ఇందులో జానపద సాహిత్యం, చారిత్రక గ్రంథాలు, ప్రాంతీయ వార్తల ఆర్కైవ్స్ ఉంటాయన్నారు. ఈ డేటాను శుద్ధి చేయడంలో సహాయం చేస్తూ.. చివరికి తెలుగు ఎల్ఎల్ఎం అభివృద్ధి బృందంలో భాగమవుతారన్నారు.



## 'సంధ్య, తుమ్ కహాన్ హో' నాటక ప్రదర్శన

హైదరాబాద్, మే14(కెరటం న్యూస్)

సామాజిక చైతన్యం కలిగించే నాటకాలకు రోడ్‌వేజ్ థియేటర్ ఎంతో ప్రసిద్ధి చెందినది. ఈ సంస్థ అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన లక్ష్యంగా ఈనెల 16వ తేదీన హైటెక్ సిటీలో గల టీ-హివ్ ఈగాలేరియా మాల్ లో 'సంధ్య, తుమ్ కహాన్ హో' నాటకాన్ని ప్రదర్శించనుంది. ఈ నాటకానికి రచన, దర్శకత్వం కెప్టెన్ ఎస్ఎన్ అహ్మద్ వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాటకం ప్రతి ఒక్కరిని ఆలోచింప చేయనుందన్నారు. ఈ నాటకం ప్రథమ ప్రదర్శన అనంతరం సైనిక వెటరన్స్, సీనియర్ సిటిజన్ టౌన్‌షిప్స్ వంటి వేదికలపై కూడా ఉంటుందన్నారు. వృద్ధాప్యంలో మతిమరుపు ఒక సహజమైన విషయంగా మన దేశంలో చాలా మందిలో ఉందన్నారు. ఇదే కారణంతో అల్జీమర్ ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తున్నామన్నారు. దీంతో అనేక మంది వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అపోహలతో ఆత్మస్థైర్యం కోల్పోతున్నారన్నారు. కుటుంబాలకు భారం అవుతున్నారన్నారు.

సైన్యంలో తన సహచరులు అల్జీమర్ వ్యాధితో పోరాడుతున్న దృశ్యాలను దగ్గరగా చూశానన్నారు. రియల్ లైఫ్ అనుభవాల నుంచి ప్రేరణ పొందిన ఈ నాటకం హాస్యాన్ని, ఉద్వేగాన్ని సమపాళ్లలో కలిపి ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. అద్భుతమైన కథనంతో ఉన్న ఈ నాటకం అల్జీమర్ బాధితులకే కాకుండా, ఆయా కుటుంబాల మౌన వేదనపై దృష్టిని కేంద్రీకరిస్తుందని తెలిపారు.

# బీమా రంగంలోకి అపోలో అడుగు

- త్వరలో 'హెల్త్-ఫస్ట్ క్రెడిట్ కార్డ్' విడుదల
- ముందస్తు ఆరోగ్య సంరక్షణలో భాగంగా 'అల్టిమేట్ హెల్త్ ప్రోగ్రామ్' ప్రారంభం



హైదరాబాద్, మే14(కెరటం న్యూస్)

నాణ్యమైన ఆరోగ్య సేవలు మరింత మందికి అందించాలన్న లక్ష్యంతో బీమా రంగంలో అడుగు పెట్టామని అపోలో హెల్త్‌కో సీఈఓ మాధివనన్ బాలకృష్ణన్ తెలిపారు. ఈ మేరకు బంజారా హిల్స్ లో ఉన్న తాజ్ కృష్ణలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపోలో హెల్త్‌కోకు చెందిన అపోలో 24ఒ7 ఇప్పుడు ఇన్సూరెన్స్ రంగంలో కూడా సేవలు అందించనుందని చెప్పారు. త్వరలోనే హెల్త్, లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ పాలసీలు అందుబాటులోకి రానున్నాయన్నారు. అపోలో హెల్త్‌కో వినియోగదారుల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకమైన ఇన్సూరెన్స్ ప్లాన్లు అందించడమే అపోలో 24ఒ7 లక్ష్యమన్నారు. కంపెనీకి ఉన్న డేటా, కస్టమర్ల ఆరోగ్యంపై అవగాహన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో పెట్టుబడులు దీన్ని మరింత విశిష్టంగా తయారు చేయనున్నాయన్నారు. రాబోయే రెండు నెలల్లో 12 బీమా సంస్థల నుంచి బీమా ఉత్పత్తులను ప్రారంభించాలని యోచిస్తున్నామన్నారు. ప్రతి ప్లాన్ కూడా అపోలో ప్రత్యేక ప్రయోజనాలతో ఉంటుందన్నారు. భవిష్యత్‌లో ఓపీడీ (ఔట్‌పేషెంట్) కవరేజ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నామన్నారు. మొదటి ఏడాదిలో రూ.80 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. భారతదేశపు మొదటి 'హెల్త్-ఫస్ట్ క్రెడిట్ కార్డ్' త్వరలో విడుదల కానుందని చెప్పారు. ముందస్తు ఆరోగ్య పరీక్షలను ప్రోత్సహించేందుకు 'అల్టిమేట్ హెల్త్ ఛాలెంజ్' ప్రారంభించామని తెలిపారు.

తెలంగాణలో అపోలో 24ఒ7 విస్తరణకు హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉందన్నారు. సాంకేతికత ద్వారా ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవడానికి కట్టుబడి ఉన్నామన్నారు. డాక్టర్ కన్సల్టేషన్లు, డయాగ్నొస్టిక్స్, మెడిసిన్ డెలివరీ, వెల్‌నెస్ వంటి సేవలను సమగ్రంగా అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 900 పైగా అపోలో ఫార్మసీ స్టోర్లు కలవన్నారు. ఇందులో 500 పైగా స్టోర్లు హైదరాబాద్‌లోనే ఉన్నాయన్నారు. ఈ రిటైల్ నెట్‌వర్క్ వల్ల రాష్ట్రంలోని ఎక్కువ మంది ఒకట్రెండు కిలోమీటర్ల పరిధిలో అపోలో ఫార్మసీకి చేరుకోగలుగుతున్నారని చెప్పారు. ఇది నాణ్యమైన ఔషధాలను సమయానికి అందుబాటులోకి తీసుకొచ్చేలా చేస్తుందన్నారు. అపోలో 24ఒ7 డిజిటల్, ఫిజికల్ ఛానల్స్ ద్వారా నెలకు సుమారు 4.5 మిలియన్ల ఫార్మసీ ఆర్డర్లను ఇవ్వగలుగుతుందన్నారు. ఇందులో హైదరాబాద్ మార్కెట్ అత్యుత్తమంగా దేశవ్యాప్తంగా అపోలో ఫార్మసీ ఆర్డర్లలో 17 శాతం వాటాను కలిగి ఉందన్నారు. భారతదేశంలో మొదటిసారి ప్రారంభించిన 'క్విక్ కామర్స్' సర్వీస్ ఎంతో ఆదరణ పొందిందన్నారు. 19 నిమిషాల్లో ఔషధ డెలివరీకి విశేష స్పందన లభించిందన్నారు. హైదరాబాద్‌లోని కొన్ని ఎంపిక చేసిన పిన్‌కోడ్‌లలో ప్రారంభించిన ఈ సర్వీస్ ద్వారా ఇప్పటివరకు 80,000 పైగా ఆర్డర్లు 19 నిమిషాల్లో విజయవంతంగా డెలివరీ అయ్యాయని చెప్పారు.